

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**ఈసారి** నేను కాఫీ తెచ్చేసరికి అతను ఏకాగ్రతగా పేషేంట్ ఎక్స్‌రే రిపోర్టు చూస్తూ, అసిస్టెంట్‌కి ఏం చెయ్యాలో చెప్తూ "థాంక్స్" అనేసి నావైపు తలకూడా తిప్పలేదు.

డాక్టర్స్ నీ వాళ్ళ దైనందిన జీవితాన్నీ చూస్తుంటే నాకు చాలా గౌరవం పెరిగిపోయింది. 'అమ్మయ్యా' ఇంటికెళ్ళిపోవచ్చు అనుకునే సమయాలకి ఎమర్జెన్సీలు, ఎక్కువగా గైనకాలజిస్ట్‌లకీ, న్యూరో సర్జన్‌కీ, ఏక్సిడెంట్ కేసులూ, బర్న్స్, సూసైడ్ ఎటెమ్ప్స్, ఇలా నానా బాధాకరమైన కేసులూ. ముఖ్యంగా పేషెంట్‌ని వెంటిలేటర్ మీద పెట్టాం, ఇంకా కొద్దిగంటలే వుంటాడు అనో, ఇంకా కొన్ని రోజులే వుంటాడు అనో, దగ్గర వాళ్ళకి చెప్పే క్షణాలు, వాళ్ళకి కూడా విషమ పరీక్షలే. ఆఫ్టాల్ వాళ్ళూ మానవ మాత్రులేగా.

ప్రబంధ్‌తో నా చనువు పెరగడం వల్ల, నా ఆహార్యంలో, మేకప్‌లో మార్పు వచ్చింది.

నేను చిలకపచ్చ చీర కట్టుకుని వెళితే, ప్రబంధ్ కళ్ళతోనే కాంప్లిమెంట్ ఇచ్చాడు. నేను బిజీగా వున్నప్పుడు, వాట్సప్ మెసేజ్ "చిలక పచ్చని చీరలో... చిగురు మెత్తనీ పడుచుదనం" అన్న పాటకి లింక్ ఇస్తూ. ఆ పాట చూస్తుంటే ఎంతో ఆనందంగా అనిపించింది.

మనం అద్దం ముందు ఎక్కువసేపు గడిపితే పట్టేసే కళ్ళు అమ్మలవి. పోలీసుల్లా" ఏవిటీ? చీర కడ్తున్నావ్? కొంచెం ఎక్కువ శ్రద్ధగా తయ్యారవుతున్నావ్" అని ప్రశ్నలు.

"నువ్వు కూరల మార్కెట్‌కి కొత్త చీరకట్టుకుని వెళ్తావు?ఎందుకూ?" అడిగాను.

"నేను నాలాగా కూరగాయలు కొనడానికొచ్చే మా ఫ్రెండ్స్‌కి నా చీరలు చూపించడానికి కట్టుకుంటాను. నీలా కాదు" అంది.

"మనం ఎంత సుత్తి జాబ్ చేసినా, ఆ వెళ్ళేచోట ఇంట్రెస్టింగ్‌గా మార్చుకోవాలి" అని చెప్పి వెళ్ళాను.

"నేనూ నీలాగే నాతో పనిచేసే అమ్మాయిల కోసం" అని చెప్పలేకపోయాను.

ఎప్పుడైనా ప్రబంధ్‌కి తీరిక దొరికినప్పుడు "నీకు ఈ పాట వచ్చా? నీ పేరు పలికినా చాలు" అని పాత పాటలు మెసేజ్ చేస్తే, నేను పల్లవి హమ్ చేసి పంపిస్తే "వండర్‌ఫుల్.. మెలోడీ క్వీన్.. లవ్‌యూ"లాంటి అనూహ్యమైన మెసేజెస్ ఇచ్చేవాడు. అంతే.

ఆ మధ్యాహ్నం అంత ఎందుకో సిగ్గుగా, నవ్వొచ్చేస్తూ, అతను రౌండ్స్‌కి వెళ్తూ గుసగుసగా 'హాయ్ డియర్' అనగానే, ఒళ్ళంతా మత్తుగా తేలిపోతున్నట్లు వుండేది.

నా కూనిరాగాలూ, సోలిపోతున్న కళ్ళూ, వాలిపోతున్న నడుమూ, జుట్టూ నిర్లక్ష్యంగా ముడి వెయ్యకుండా, విరబోసి, అందులో గులాబీ పెట్టుకోవడం, వెంకటగిరి చీరలతో కుట్టిన చుడీదార్లు వేసుకుని పొడవాటి జడ తిప్పుకుంటూ అతని గదిలోకి నడవడం, పెదవులు బిగించి, నవ్వు ఆపుకుంటూ "కాఫీ తేనా?" అని నారాయణ వున్నా అడగడం.. ఫోన్‌లో ఇయర్ డోప్స్‌తో అప్పుడప్పుడూ "మధువొలకబోసే నీ చిలిపికళ్ళూ... అవి నాకు వేసే బంగారు సంకెలలూ... ఈ పాటేనా?" అని పాడడం, ఇవన్నీ ఎవరూ గమనించకుండా ఎలా వుంటారూ? సీనియర్ సిస్టర్ మెర్సీ గుర్తించింది.

"రిషీ ఆర్ యూ ఇన్ లవ్?" అని అడిగింది. నేను తత్తరబాటుతో చూసాను.

"జాగ్రత్త. ఈ ఏజ్‌లో చాలా ఏక్సిడెంట్స్ జరుగుతాయి మనసుకి. నాకూ ముప్పై ఏళ్ళ క్రితం ఇలాంటివి అనుభవమే. డాక్టర్స్ రొమేంటిక్‌గా జోవియల్‌గా వుంటారు. వాళ్ళ వృత్తిలోని సీరియస్‌నెస్ నుండి రిలీఫ్ పొందడానికి" అనేసి వెళ్ళిపోయింది.

నాకు చర్నాకోలా దెబ్బలా తగిలింది ఆ మాట. అంటే నేను డాక్టర్‌తోనే లవ్‌లో పడ్డాను అని అర్థమైందనమాట.

అప్పుడు, డాక్టర్ పద్మనాభంగారితోటీ, రామనాథం గారితోటీ, సుదర్శా దీక్షిత్‌తోటీ పడననీ, తప్పకుండా యంగ్ అండ్ హేండ్‌సమ్ ప్రబంధ్‌తోనే లవ్‌లో పడివుంటానని గ్రహించేసే వుంటుంది. ఎలా? ఇప్పుడేం చెయ్యాలీ? మేం అంత పట్టుబడి పోతున్నామా?

ప్రబంధ్ మెసేజ్ చేసాడు, "కాఫీ కావాలి, ఎప్పటిలాగా హాస్పిటల్‌లో కాదు, స్ట్రీట్ కార్నర్‌లో కొత్తగా 'ఇవోక్' అనే కాఫీ కేఫ్ పెట్టారు. అక్కడ.. ఎగ్జాట్లీ సాయంత్రం 7 పి.ఎం.కి" అని వుంది.

"నాకు కుదరదు అనాలా? అంతా అనుమానిస్తున్నారు" అనాలా? ఏం అనాలీ? అని ఆలోచిస్తుండగానే ఆ టైం అయిపోయింది. టాయ్‌లెట్‌లోకి వెళ్ళి తలదువ్వుకుని, లైట్‌గా మేకప్ వేసుకున్నాను.

స్ట్రీట్ చివర నిలబడి అతని మెర్సిడీస్ బెంజ్ కోసం వెయిట్ చేస్తుంటే, వైట్ బెంజ్ వచ్చి ఆగింది. అతను దిగలేదు. డోర్ తెరిచి పట్టుకుని "గెటిన్" అన్నాడు.

ఏ చెయ్యాలో తోచక ఎక్కాను. డార్క్ ఫిల్మ్ వుండడంతో విండోస్‌లోంచి బయటకి ఎవరం కనిపించం.

అతని మ్యూజిక్ సిస్టంలోంచి పాత పాటలు వినిపిస్తున్నాయి.." విన్నవించుకోనా చిన్న కోరికా? ఇన్నాళ్ళూ నా మదిలో వున్న కోరికా.."

నేను "కాఫీ తాగుదాం అన్నారూ" అన్నాను.

"తాగుదాం, తొందరేం.. చిన్న డ్రైవ్‌కి వెళ్ళి అప్పుడూ.." అని నేనేదో అనేలోపే

" ఈ రోజు మూడూ సర్జరీలూ, పెద్దవే.. అందులో ఒకటి ఫెయిల్ అయింది. చిన్న వయసే, బ్రెయిన్ ట్యూమర్ రిమూవ్ చేసాక హార్ట్ ఫెయిల్ అయింది పాపం" అన్నాడు.

ఆ సమయంలో అతను చాలా బధగా గిల్టీగా "నా చేతిలో ఇలా అవడం రేర్.. చాలా బాధగా వుంది" అనడంతో. నేను ఏమీ మాట్లాడకుండా అతన్ని మాట్లాడనిచ్చాను.

నాకూ అర్ధమౌతోంది. అతనికి ఓ స్నేహం కావాలి. ఔట్‌లెట్ కావాలి, నేను అతనితో దేనిలోనూ సమానం కాదు. కాని ఆడపిల్లను, ఆ క్వాలిఫికేషన్ చాలు. అది అతని ఇంట్రెస్ట్. అతను అన్ని విధాలా గొప్ప స్థాయిలో వున్నాడు. పైగా అందగాడు. నాకు అప్పటికే డాక్టర్స్ అంటే గొప్ప అడ్మిరేషన్ ఏర్పడిపోయింది. ప్రాణాలు పోసే డాక్టర్స్ ముందు పేషెంట్స్ చేతులు జోడించి ప్రార్ధించడం. బతకడనుకున్న పేషెంట్ బతికితే, అతని తాలుకు వాళ్ళ కాళ్ళమీద పడిపోవడం. ఇవన్నీ డెయిలీ చూడడంతో, వాళ్ళమీద, ముఖ్యంగా ప్రబంధ్ మీద ఆరాధన పెరిగిపోయింది.

"ఎందుకిలా నాతో క్లోజ్‌గా మూవ్ అవుతున్నారు?" అడిగాను.

"నిజం చెప్పలేను. అబద్దం ఆడలేను" నవ్వాడు.

ఆ తర్వాత "నీ ఇన్నోసెన్స్ నచ్చింది" అన్నాడు.

నా గురించి అడిగాడు, నా చదువు, నా ఇష్టం. నా ఇండివిద్యుయాలిటీ అన్నీ. తన మెడికల్ కాలేజ్ లైఫ్ గురించీ, నర్స్‌లతో తను చేసిన చిలిపి పనుల గురించీ చెప్తుంటే, నాకు కాస్త అలకొచ్చింది. ఈ కాసేపటికే, అతని మీద నాకెంతో చనువొచ్చేసి, అతను నాకు స్వంతం అయిపోయిన ఫీలింగ్. చాలా ఫూలిష్‌నెస్.. పచ్చి కుండలా చూడ్డానికి అందంగా పగలడానికి సిద్దంగా వున్న వయసు అది.

అతను చెయ్యి జాపాడు. నేను నా చేతిని అతని చేతిలో వేసాను. అతను తన పెదవులకి ఆనించుకున్నాడు.

"ఇది ముద్దుకాదు. ఫ్రెండ్‌షిప్" అన్నాడు.

నేను నవ్వాను. ఆ నిమిషాన గర్వంతో తేలిపోయాను.

ఇద్దరం కాఫీ కాదు చాయ్ తాగాం. ఊరి చివరదాబాలో. అతను నన్ను మళ్ళీ ఇవోక్ దగ్గర దింపేటప్పటికి ఊరు నిద్రపోయింది. అతను బై చెప్పేటప్పుడు నన్ను దగ్గరకి లాక్కుని నా చెవిమీద పెదవులు ఆనించి ముద్దుపెట్టి 'బై' అన్నాడు.

ఈసారి కొద్దిగా డిజప్పాయింట్ అయ్యాను.

అతని కార్ వెళ్ళిపోయాక, పార్కింగ్‌లో వున్న నా టూ వీలర్ తీసుకుని బయలుదేరాను.

అమ్మవి పోలీస్ బుద్ధులు "ఏమిటింత లేట్? ఫోన్ ఎందుకు స్విచ్ ఆఫ్ వచ్చిందీ?" అంది నేను ఎంటర్ అవగానే.

"బోయ్‌ఫ్రెండ్‌తో షికార్ వెళ్ళాను. 'కారులో షికారుకెళ్ళే పాలబుగ్గల పసిడీ చానా!' పాటకూడా విన్నాం. అలసిపోయాను, అన్నం పెట్టు" అన్నా.

"ఈ తల తిక్కే వద్దనేది" అని అరిచింది. నేను హాస్పిటల్‌లో పనివల్ల ఆగిపోయాను. మా ఫ్రెండ్ వనజతో షాపింగ్‌కి వెళ్ళాను ఎక్స్ట్రా చెపితే, ఛస్తే నమ్మేది కాదు. నేనేం చెప్పినా నమ్మదుగాక నమ్మదు అనడానికి రుజువు. నేను బోయ్ ఫ్రెండ్‌తో షికారుకి వెళ్ళాను అంటే నమ్మలేదు. తల్లిదండ్రుల నమ్మకానికి జోహార్లు. ముఖ్యంగా ఇండియాలో.

భోజనాల దగ్గర నాన్న "మా కొలీగ్ కూతురు పెళ్ళి. ఆదివారం సాయంత్రం అందరం వెళ్తున్నాం" అన్నారు.

"నేను రానని చెప్పాను" అసలే చపాతీల్లోకి కేబేజ్ కూర చేసిన అమ్మ మీద నాకు చిరాగ్గా వుంది.

"ఎందుకు రావూ?" నాన్న అడిగారు.

"పెద్ద స్ట్రోలర్ తీసుకుని, మోసుకు రాలేనని వెళ్తావు కూరలకి. ఈ కేబేజీ, సొరకాయా, గోబీ కాప్సికమ్ లాంటి నీళ్ళు కారిపోయే కూరలు తప్ప, స్పైసీగా చేసేవి ఏం లేవా?" అమ్మని అడిగాను.

"ఆస్పత్రి డోర్ అవతల నిలబడి, పేర్లు పిలిచి, డాక్టర్ దగ్గరకి చీటీ ఇచ్చి పంపే ఉద్యోగానికి ఇవి చాల్లే" అంది వెటకారంగా.

నాన్న తన పాయింట్ వదలలేదు "ఎందుకు రావు? మూర్తి కూతురి పెళ్ళికి? వస్తే నువ్వూ నలుగురి దృష్టిలో పడి, నీకూ ఏదైనా సంబంధం కుదరచ్చు" అన్నారు.

"కూరగాయల మార్కెట్‌లో, వంకాయలాగా కదూ. నదురుగా కనపడడానికి వాళ్ళు నీళ్ళు జల్లుతూ వుంటారు. మీరు పట్టుచీర కట్టి, కూడా పెట్టుకుని వెళ్తారు" అన్నాను.

"ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌వి కావు. మంచి ఉద్యోగం లేదు. ఈ అందం వుండగా పెళ్ళి చేసుకుంటే, కనీసం మంచి సంబంధం రావచ్చు" అంది అమ్మ.

"ఈ ఉప్పు కశం కూర నువ్వే తిను.." అని లేచి వెళ్ళి చెయ్యి కడుక్కుంటూ "మీరు తెచ్చే సంబంధాల కన్నా మంచి సంబంధం నేనే చూసుకుంటా" అన్నాను.

ఏడేళ్ళ క్రితం కూడా అంతే ధాటిగా ఈ మాట అన్నాను.

అమ్మ గొణుగుతోంది "అసలు ఆ ఉద్యోగం ఎందుకో, ఏం సంపాదిస్తోందో కూడా అర్థంకావడం లేదు. బట్టల షాప్‌లో పదిహేనువేలు బిల్ అయింది.. ష్... శ్రీరామచంద్రా"

"ఏం కృష్ణుడు గుర్తురాడా? నా పేరు తలుచుకోవేం?" నాన్న జోకారు.

దాని తర్వాత ఇద్దరూ ఏం అనుకున్నారో కిలకిలా అమ్మ నవ్వులు వినిపించాయి.

పోన్లే వాళ్ళని ఈ రొమేంటిక్ మూడ్‌లో వుండనీ. అనుకుంటూ, వెళ్ళి బెడ్‌రూం తలుపేసుకున్నాను. సెల్‌లో మెసేజ్ "ఈ సాయంత్రాన్ని వెలిగించినందుకు థాంక్స్" అని పెట్టాడు ప్రబంధ్.

ఇతను మెడిసిన్ కాదు, తెలుగులో లిటరేచర్ చేసాడేమో అనిపించింది.

నేను అప్రయత్నంగా డయిల్ చేసాను.

అతను తీసాడు, రహస్యం మాట్లాడుతున్నట్లు గొంతు పెట్టి "నిద్ర రావడంలేదు కదూ" అన్నాడు.

"ఊహూ" అన్నాను.

"వెలిగించుమా చిన్ని వలపు దీపం..." అని పాడాడు.

"మీ గొంతు ఎంత బావుందీ?"

"ఏ పార్టు బాలేదూ?" చిలిపిగా అడిగాడు.

"నేను గొంతే విన్నాను" అన్నాను.

"నీ సెన్స్ ఆఫ్ హ్యూమర్ నాకు నచ్చింది చూడామణీ" అన్నాడు.

"రుష్యేంద్రమణి.. లేదా రిషి అనండి" అన్నాను.

"నిన్ను ఏ మణితో పోల్చినా తనివి తీరట్లేదు మరి" అని నవ్వాడు.

"ఇంకో పాట పాడండి" అన్నాను.

"నన్ను దోచుకుందువటే.." అలా ఆ విభావరి సాగింది.

ప్రబంధాలలో మాత్రమే వర్ణించేటంత అందగాడు.

'మిరకిల్ హేండ్' అని పేరు మోసిన న్యూరో సర్జెన్, చాలా డామేజింగ్‌గా గోపాలం బావలనీ, మూర్తిగారింట్లో పెళ్ళికి వచ్చి ప్లేట్ పట్టుకుని దోశలేసే వాడి ముందు క్యూలో నిలబడి "మీ హాబీస్ ఏంటీ?" అని అడిగే దేభ్యం మొహం పెళ్ళి కొడుకులనీ చూస్తాం అనే అమ్మా, నాన్నలకి పెద్ద షాక్ ఇస్తా. ప్రబంధ్ నా మీద ఇంట్రెస్టెడ్ అని చెపితే ఏం అయిపోతారో? ఈ బర్త్‌డేకి అతన్ని ఇంటికి పిలిచి ఇంట్రడ్యూస్ చేస్తా! మా స్టాటస్ మరీ తీసికట్టు కాదు. మంచి డూప్లెక్స్ హౌస్ వుంది గేటెడ్ కమ్యూనిటీలో, అతనికీ తెలుస్తుంది" అన్నాను యాషీతో ఫోన్‌లో.

"ఓ మై జీ!" నేనెప్పుడు రానూ?" అని అరిచింది.

"అంటే ఓ మైగాడ్ అను, లేదా OMG అను. అసహ్యంగా ఓ మై జీ  అనకు" చిరాకుపడి "రా. ఈ నెలాఖరికల్లా ఫైనలైజ్ చేద్దాం. నాకు టైం అవుతోంది. నేను వెళ్ళాలే" అన్నాను.

"మరి లవర్‌బాయ్ ఎదురు చూస్తూ వుంటాడు వెళ్ళు. వాట్ ఎ నేమ్ ప్రబంధ్? మా ఫ్యామిలీ డాక్టర్ పేరు అప్పలసామి...హూ!" అంది.

నేను నవ్వి "బై" అని ఫోన్ పెట్టేసి, అద్దంలో ఇంకోసారి కొత్త టాప్‌నీ, టోర్న్ జీన్స్‌నీ చూస్తుకుని "అమ్మా వెళ్ళొస్తా.. బామ్మా వెళ్ళొస్తా" అని అరిచి బయల్దేరుతుంటే, బామ్మ భాగవతం పుస్తకం కిందనుండి చూసి "అడుక్కునే వాళ్ళలా ఆ చిరిగిన గుడ్డలేంటి? వెళ్ళి వేరేవి వేసుకో" అని అరిచింది. తల కొట్టుకుని బయట పడ్డాను.

రాత్రి ప్రబంధ్ గుసగుసగా నా చెవిలో, ఫోన్‌లో చెప్పిన చిలిపి సంఘటనలూ, మధ్య మధ్యలో పెట్టిన ముద్దులూ, నా చేత బలవంతంగా ముద్దు పెట్టించుకోవడం అన్నీ గుర్తు వస్తున్నాయి. మాటిమాటికీ డోర్ వైపు చూస్తున్నాను. పది, పదకొండు, పన్నెండూ. అతను రాలేదు.

అతని అసిస్టెంట్ నారాయణరావు, దద్దోజనం తినొచ్చినట్లు నిద్రమత్తుతో తూలుతూ వుంటాడు. ఫ్లాస్క్ తీసుకుని పోతుంటే, పిలిచి "డాక్టర్‌గారు రాలేదా?" అడిగాను.

"డాక్టర్ ప్రబంధా?" అడిగాడు.

"అవును"

"ఇవాళ ఉదయం ఎనిమిదింటికే వచ్చారు. సర్జరీ వుందిగా ఎం.పిగారి అమ్మగారికి. ఆపరేషన్ థియేటర్‌లో వున్నారు" అనేసి వెళ్ళిపోయాడు.

రాలేదేమోనని దిగులుగా 'లబ్..డబ్ 'మంటున్న గుండె, హుషారుగా గడగడా కొట్టుకోవడం మొదలయింది.

లంచ్ టైంలో బాక్స్ తెరిస్తే, కాకరకాయ కూర.

మెర్సీ వచ్చి "ఏం కూరా?" అంది.

"కాకరాయ కూర" అన్నాను.

"చేదు ఇష్టమా?" అడిగింది నవ్వి.

"చాలా..." అన్నాను. స్పూన్‌తో ఓ ముద్ద నోట్లో పెట్టుకున్నానో లేదో, సర్జరీ నుండి కోటూ, మాస్కుతో ప్రబంధ్ డోర్ తీసుకుని వస్తూ కనిపించాడు. నేను వెలిగిపోతున్న మొహంతో లేచి నిలబడ్డానో లేదో "ప్రభా.. ఐ యామం సో టైయర్డ్ డార్లింగ్" అని. అతని వీపు మీద చెయ్యి వేస్తూ, పక్కనున్న డాక్టర్ అమ్మాయి, కేప్ తీసింది. జలజలా జారే జలపాతంలా ఆమె హెయిర్ కిందకి జారింది. మాస్క్ తీసింది. చంద్రబింబంలాంటి మొహం మీద, ముక్కు కింద ఓ పెద్ద పుట్టుమచ్చ. చాలా అందంగా వుంది ఆమె.

"డార్లింగ్ రిలాక్స్. లంచ్‌కి బయటకెళదాం" అని ఆమె భుజం మీద చెయ్యివేస్తూ, నన్ను చూసాడు.

నేను సూటిగా కళ్ళల్లోకి చూసాను.

అతను తలతిప్పి "ప్రతిమా కమ్ అని ఆమెతో తన రూంలోకెళ్ళాడు. స్వింగ్ డోర్ నా మొహం మీద 'టప్'మని మూసుకుంది, మెర్సీ నావైపు చూస్తోంది.

నేను మామూలుగా వుండడానికి ప్రయత్నిస్తున్నా, నా మొహం ఎర్రబడి వుంటుందని నేను ఊహించాను. "ఎవరైనా ఇలా స్టాఫ్ ముందు.. ఇలా డార్లింగ్ అని పిలుచుకోవడం, ముట్టుకోవడం, పట్టుకోవడం అవసరమా?" అన్నాను.

"ఎవరికైనా ఎందుకు అభ్యంతరం? అతని పెళ్ళాన్ని అతను ముట్టుకుంటే, పట్టుకుంటే?" అంది మెర్సీ.

ఠంగ్‌మని నెత్తి మీద రాయిపడినట్లు చూసాను.

"వాట్?" అన్నాను.

"డాక్టర్ ప్రతిమ, డాక్టర్ ప్రబంధ్ భార్యాభర్తలు, పైగా ఈ హాస్పిటల్ డాక్టర్ ప్రతిమ ఫాదర్‌ది. ఆవిడ రోజూ రాదు. ఇలా ప్రముఖుల సర్జరీలప్పుడు అసిస్ట్ చెయ్యడానికి వస్తారు" అంది మెర్సీ.

నేనూ ప్రబంధ్ ముందు రోజు విన్న పాట గుర్తొచ్చింది. "కలలోనే ఒక మెలుకువగా, ఆ మెలుకువలోనే ఒక కలగా.. తెలిసీ తెలియని అయోమయంలో.."

ముద్ద మింగుడు పడలేదు, కాళ్ళకిందనేల కదిలి, నేను అందులోకి కృంగిపోతున్నట్లుగా అనిపించింది.

గోపాలం దోశ ప్లేట్ పెట్టుకుని, పెళ్ళిలో నవ్వుతూ హేళనగా నా వైపు చూస్తున్నట్లూ, నేను తల వంచుకుని, నేలలోకి, ఎవరో నా నెత్తిన సుత్తితో మేకు దిగ్గొడితే, దిగబడిపోతున్నట్లూ... అనిపించింది.

లంచ్ బాక్స్ మీద మూత పెట్టేస్తుంటే మెర్సీ "ఏం తినట్లేదూ?" అంది.

"చేదుగా వుంది" అన్నాను.

"చేదు ఇష్టం అన్నావుగా?" అంది.

ఆమె కళ్ళలో నవ్వు. ముందే హెచ్చరించింది కూడానూ. అందుకే విషయం అర్థమై ఆ సాడిస్టిక్ స్మైల్.

నా కళ్ళల్లో నీటి తెర ఆమె చూడకూడదని, లేచి చెయ్యి కడుక్కునే వంకతో లోపలికి నడిచాను.

ప్రతిమ తండ్రి హాస్పిటల్ ఇది. అతను ఇక్కడ ఉద్యోగి. అంటే భార్య కింద ఉద్యోగి. ఎంత ధైర్యంగా ఓ పెళ్ళికాని అమ్మాయితో ఫ్లర్ట్ చేసాడు?" అసలు నీకే రంగు ఇష్టం? ఏ కూర ఇష్టం? ఏ ఆట ఇష్టం? ఏ పాట ఇష్టం? ఏ వల్లకాదు ఇష్టం? అని పోచుకోలు ప్రశ్నలూ, వెకిలి నవ్వులూ కాకుండా, "నీకు పెళ్ళి అయిందా? ఈ హాస్పిటల్‌లో ఎలా ఉద్యోగం వచ్చిందీ?" అన్న ఇంపార్టెంట్ ప్రశ్నలు నేనెందుకు అడగలేదూ?

" ఏం ఐ ఏ ఫూల్?"

"ఎస్.. యూ ఆర్" అంది మనసు.

యాషి దగ్గరనుండి ఎస్.ఎమ్.ఎస్ "సాట్ 'ఫ్లైట్'బుక్. కమ్ టు ... విమానం బొమ్మ."

సాటర్‌డే టికెట్ బుక్ చేసుకుందిట.

నేను ఓసి దీని ఆత్రం మండిపోను. ప్రాణ స్నేహితులంటే మరీ ఇంత ప్రాణం తియ్యాలా? వెంటనే మెసేజ్ చేసాను.

"కమ్.. పెద్ద పెద్ద కళ్ళ ఇమోజీ పక్కన ఎఫ్. డబ్ల్యూ. డీ అంటే 'లుకింగ్ ఫార్‌వార్డ్' అని.

హాఫ్ డే లీవ్ పెట్టి ఇంటికెళ్ళిపోదాం అని నిశ్చయించుకున్నాను. లీవ్ లెటర్ ఎచ్.ఆర్.కి పంపబోతుంటే, మనసు మళ్ళీ బయటకొచ్చి నిలదీసింది" నిన్న రాత్రంతా 70ఎం.ఎం.లో సినిమా చూపించి, అదీ 3డిలో, ఈ రోజు పెళ్ళాం భుజం మీద చెయ్యి వేసి, "డార్లింగ్ లంచ్‌కి హోటల్‌కి పోదాం అంటే, "నిన్న నాతో కాఫీతో సరిపెట్టావేం?" అని రూం డోర్ తీసుకుని వెళ్ళి పెళ్ళాం ముందు నిలదీయకుండా, వెధవ మొహం వేసుకుని హాఫ్ డే లీవ్ పెట్టి ఇంటికి వెళ్ళి ముసుగు పెట్టుకుని పడుకుని ఏడుస్తావా? అసలు నిన్న ఏవనుకున్నావ్? ఇంటికి తీసుకెళ్ళి, "దేభ్యం మొహం గోపాలాన్ని కాదు. ఇలంటి హీరో మీ అల్లుడు కాబోతున్నాడు" అని గర్వంగా చెప్దాం అనుకున్నావ్ కదూ, వెళ్ళి నాలుగూ కడిగెయ్యి. అని మనసు ప్రబోధించింది.

కళ్ళు వెళ్ళిన చోటికల్లా మనసూ, మనసు వెళ్ళిన చోటికల్లా మనిషీ వెళ్ళకూడదన్నాడు. వివేకానంద.. కాదు రామకృష్ణ పరమహంస. అసలు ఇద్దరూ కాదు. మరొకరేమో మంచి మాటలూ, ప్రవచనాలూ, అందరి మహానుభావుల మీదా వాట్సప్ మెసేజ్‌లుగా తిరుగుతుంటాయి. ఎవరు మాత్రం విన్నారు కనుక.

నేను రూం డోర్ మీద 'నాక్' చేసాను. "ఎస్.." అని ప్రబంధ్ గొంతు వినిపించింది. ప్రతిమ అతన్ని ఆనుకుని కూర్చుని వుంది సోఫాలో. అది సోఫా కమ్ బెడ్ ఏమో కూడానూ.

ప్రబంధ్ మొహంలో నవ్వు ఎగిరిపోయింది. కొద్దిగా జరిగాడు. ఆమెకి దూరంగా.

"వాట్?" అంది ప్రతిమ.

ఆమెగొంతులో గొప్ప దర్పం. అసలు ఈ ప్రపంచంలోకెల్లా గొప్పదాన్ని నేను. నా పక్కనింత అందగాడైన భర్త వున్నాడు అన్నట్లుంది ప్రతిమ ఫేస్.

"డాక్టర్ గారూ నిన్న ఈవినింగ్ మీతో డ్రైవ్ కొచ్చినప్పుడు, నా ఇయర్ రింగ్ కార్‌లో పడిపోయినట్లుంది, ఇంట్లో కనిపించక ఇల్లంతా వెతికాను. కొంచెం చూసి రిసెప్షన్‌లో ఇచ్చెయ్యండి" అన్నాను.

"నిన్న ఈవెనింగా?" ప్రతిమ అరిచినట్లు అని ప్రబంధ్ మొహంవైపు తల తిప్పింది.

"సారీ మేడం. మీ అంత అందమైన వైఫ్ వున్నట్లు ఆయన ఒక్క మాట కూడా అనలేదు. రాత్రంత ఫోన్‌లో మాట్లాడినప్పుడూ చెప్పలేదు. పుట్టింటోళ్ళూ తరిమేసారూ, కట్టుకున్నోడూ వదిలేసాడూ. పాట సాహిత్యం ఎవరన్న విషయం కూడా బోలెడు సేపు డిస్కస్ చేసారు. అసలు నా చెవి రింగ్‌కి మీరు ముద్దుపెట్టినప్పుడు జారిపోయి వుంటుంది డాక్టర్. దాని జెండర్ కూడా ఫీమేల్ ఏమో? కొంచెం చూడండి" అని డోర్ వేస్తూ, షాక్ తిన్న అతని మొహం చూసాను.

"నాన్‌సెన్స్. ప్రతీ నమ్మకు" అని ఏదో చెప్తున్నాడు.

నేను ప్రతిమ రియాక్షన్ ఊహిస్తూ బయటకి నడిచాను. మెర్సీ ఎదురొచ్చింది, "మెర్సీ సిస్టర్" ఆమె చెయ్యి పట్టుకుని చెప్పాను.

"థాంక్స్.. మీరు హెచ్చరించారు. అయినా నేను వినలేదు. అందుకు ఫలితం ఇప్పుడు మీ డాక్టర్ గదిలో అనుభవిస్తున్నాడు. పెళ్ళాం ముందు అతని ప్రబంధాన్ని బయట పెట్టాను. ఇంక మళ్ళీ ఈ డోర్‌లోకి అడుగు పెట్టను. బై" అని బయటకి నడిచాను.

మెర్సీ కంగారుగా "ఏం చేసావ్? " అని రూం వైపు చూసింది. పెద్ద పెద్ద అరుపులు వినిపిస్తున్నాయి.

ఎయిర్‌పోర్ట్‌లో రాంబండి దగ్గర కూర్చుని రెండో ప్లేట్ దోశ తింటూ, యాషిక నావైపు ఆశ్చర్యంగా చూస్తోంది.

"దెయ్యాని చూసినట్లు అదేం చూపే?" అన్నాను.

"మా నానమ్మ 'మీది ఫాస్ట్ జెనరేషన్. ఫాస్ట్ జెనరేషన్. అంటే ఏమో అనుకున్నాను. ఇంత ఫాస్ట్‌గా కలుసుకోవడం, ప్రేమలో పడడం. తెల్లారేసరికి బ్రేకప్. ఓ మై జీ!" అంది యాషి.

"చీకటి వెలుగుల రంగేళీ. జీవితమే ఒక దీపావళీ" పాట నాకు ఇష్టం అని అతను అన్నప్పుడే గెస్ చెయ్యాల్సింది నేను" అన్నాను.

"అసలు ఈ ఓల్డ్ మెలడీస్ టేస్ట్ ఏవిటే?" అంది.

"డాక్టర్‌కి ఓ సుందర స్వప్నం వుండి వుంటుంది. కాబోయే భార్య ఇలా తనతో కలిసి మెలడీలు పాడాలనీ, పొద్దుటే తలకి తువ్వాలు చుట్టుకుని, తులసికోట చుట్టూ తిరిగి, కాఫీ తీసుకొచ్చి తనని నిద్రలేపాలనీ.. కానీ ఇమేజినేషన్ వేరూ, రియాలిటీ వేరు. తనకి ఇంత పెద్ద మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, ప్లస్ అందమైన గొప్పింటి డాక్టర్ పెళ్ళాం దొరికేసరికి, బెడ్ కాఫీ, పాత పాటా, తులసి కోటా తీరని కోరికలై... ఇలా కన్నెపిల్లలు తారసపడినప్పుడల్లా, పైత్యం ప్రకోపిస్తోందేమో?"

యాషీ చప్పట్లు కొట్టింది "నువ్వు సినిమా రైటర్ అయిపోవాల్సిన దానివే" అని.

యాషికతో ఇల్లు చేరేటప్పటికీ లేట్ అయింది.

అమ్మా నాన్నా టీవీ చూస్తున్నారు. బ్లాక్ అండ్ వైట్. అస్సలు సరిగ్గా కనపడని ప్రింట్, మధ్యలో కారప్పుస ప్లేట్‌లో పెట్టుకుని, కనురెప్ప కొట్టనంత ఆసక్తిగా చుస్తున్నారు. హీరోయిన్ మూడవసారీ, హీరో మూడో సారి అపార్థాలు. చేసుకున్నట్టున్నారు.

"నీ సుఖమే నే కోరుకున్నా. నిను వీడి అందుకే పోతున్నా" అంటున్నాడు హీరో.

అమ్మ నన్ను చూడగానే "ఇంత అర్ధరాత్రిదాకా ఎక్కడ తిరిగి వస్తున్నారు? యాషీ ఎప్పుడొచ్చింది?" అని అరిచింది.

"ఇప్పుడే వచ్చింది. ఎయిర్‌పోర్ట్ నుండి వస్తున్నాం" అన్నాను.

"అయినా పగలు రావచ్చుగా? ఎందుకీ అర్ధరాత్రి తిరుగుళ్ళు?" టీ.వీ టపీమని ఆఫ్ చేసేసింది అమ్మ.

"నాకు బ్రేకప్ అయింది. అందుకే కొంచెం ఓదారుద్దాం అని ఇది వచ్చింది. కొంచెం చిల్ అయి వస్తున్నాం. హేంగ్ అవుట్ ప్లేసెస్‌లో" అన్నాను.

"ఏంటీ? బ్రేకప్పా? హేంగవుటా? చిల్లా?" డాడీ అప్పుడే స్పృహలోకి వచ్చినట్లు అడిగారు.

అమ్మ "మీరేమైనా మగరాయుళ్ళా?" అని అరిచింది.

యాషీ భయంగా "ఆంటీ చిల్ అవుట్ అంటే జస్ట్ రాంబండి దగ్గర దోశ తిని వచ్చాం. అంతే" అంది.

"ఆ ముదనష్టం భాషెందుకు మరి? నేను నిన్ననే రుబ్బి పెట్టాను. ఫ్రిజ్ నిండా దోశ పిండీ, ఇడ్లీ పిండీ. బయట తినడం ఎందుకు?" అంది కోపంగా అమ్మ.

"బీర్ కూడా తాగాం అమ్మా . ఒట్టి దోశ అంటే నువ్వు అఫెండ్ అయినట్లునావ్?" అన్నాను.

"చూశారా?" అని అమ్మ నాన్నవైపు తిరిగి, ఆయన కూడా నన్ను తిట్టాలన్న క్లూ ఇచ్చింది.

"మమ్మీ నో మోర్ డ్రామాస్. రావే" అని యాషీని తీసుకుని నా గదిలోకి నడిచాను.

కింద అమ్మ "దీనికి పెళ్ళి చేసెయ్యాల్సిందే.. అడ్డూ అదుపూ లేకుండా తయ్యారవుతోంది" అని అరవడం వినిపిస్తోంది.

నేను గది తలుపులు వేసేసాను.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS